## క్లుప్తంగా

### మార్చి 10న శ్రీవేంకటేశ్వర కల్యాణం



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా వెంకటేష్ ఖని గుట్టపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం మార్చి 10న నిర్వహించనున్నట్లు వీకే–7 గని మేనేజర్ వైవీ రావు అన్నారు.ఈ మేరకు బుధవారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. 10 రోజులు జరగనున్న ఈ వేడుకలకు పట్టణ ప్రముఖులు, ఏరియా అధికారులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని, తమకు తోచిన విరాళాలు అందజేయాలని కోరారు.

### ఆదివాసీ విద్యార్థులకు పలక, బలపాలు పంపిణీ



పిల్లలకు పలకలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మారుమూల గిరిజన ప్రాంతంలో చదువుకుంటున్న ఆదివాసీ గిరిజన విద్యార్థులకు ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గ్రామానికి కాలినడక వెళ్లి విద్యార్థులకు ఒక పూట భోజనం వండి పెట్టి పలక, బలపాలను పంపిణీ చేశారు. మండల పరిధి దంతలబోరు గ్రామపంచాయతీలోని సీతారాంపురం గ్రామంలో ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న ఆదివాసీ గిరిజన విద్యార్థులకు స్త్రీశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం భోజనాలు వండి పెట్టి పలక, బలపాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఉమాకుమారి, ప్రియ, అనిత, పావని, అమృత్ పాల్గొన్నారు.

### చదువుతో నైతిక విలువల పెంపు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: చదువు తలరాతను మార్చడంతో పాటు సంస్కారం, నైతిక విలువలను నేర్పుతుందని కొత్తగూడెం మండల విద్యాధికారి డాక్టర్ ఎం.ప్రభుదయాళ్ అన్నారు. బుధవారం సుభాష్ చంద్రబోసనగర్‌లోని మోడ్రన్ ఇక్రా స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాటాడ్లారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏరియా వర్క్ షాప్ ఇంజనీర్ ఉపేందర్‌బాబు, మొక్కల వెంకటయ్య, కే.విజయలక్ష్మి, షేక్ అబ్దుల్ బాసిత్, అబ్దుల్ సమద్, పర్వీన్ సుల్తానా, టీచర్లు పాల్గొన్నారు.

### ముగిసిన జాతర



ఇప్పలతండాలో అగ్నిగుండం కార్యక్రమం

టేకులపల్లి: కోయగూడెం పంచాయతీ ఇప్పల తండాలో కొలువుదీరిన లింగబసవేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 22న ప్రారంభమైన లింగబసవేశ్వర స్వామి జాతర వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. పూజారులు బానోతు శ్రీను, జర్పుల మంగమ్మ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మంతోజు పవన్‌కుమారాచార్యుల అర్చకత్వంలో శివపార్వతుల కళ్యాణం, అగ్నిగుండం, స్వామివారి ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి కోరం లక్ష్మి, సురేందర్, ఉమ తదితరులు వేడుకలకు హాజరై పూజలు చేశారు. టేకులపల్లి, ఇల్లెందు, ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచతో పాటు హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

### వితరణ



ఈఓకు డ్రమ్ము అందజేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల్లో కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం కేశవాపురం గ్రామానికి చెందిన గొల్ల శ్రీమన్నారాయణ దంపతులు ఎలక్ట్రికల్ డ్రమ్‌ను ఈఓ రజనీకుమారికి వితరణ అందజేశారు.



పాత పాల్వంచ ఆత్మలింగేశ్వరాలయంలో...



ఇల్లెందు: పటేల్ చౌక్‌లోని శివాలయానికి పూజా సామగ్రితో వస్తున్న భక్తులు



చుంచుపల్లి: పెనగడప శివాలయంలో..

# శివోహం..

మార్మోగిన శైవక్షేత్రాలు ● భక్తిశ్రద్ధలతో ఆదిదేవునికి ప్రత్యేక పూజలు





టేకులపల్లి: సిద్దారంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



పాల్వంచరూరల్: శివాలయంలో...

శివరాత్రి వచ్చిందంటే కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతమంతా కైలాస సదనంగా మారుతుంది. పట్టణం, పల్లెల్లో శివనామం మార్మోగిపోతుంది. బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పర్వదినం జరుపుకున్నారు. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు వెళ్లి ఆదిదేవుడికి పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు ఆచరించారు. సదాశివునికి రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పాత పాల్వంచ చింతలచెరువు కట్టపై ఉన్న ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో సూర్యోదయం వేళ శివలింగంపై సూర్యకిరణాలు పడే సమయంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని తిలకించి పరవశించారు.

– సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: కాశీ నుంచి తెచ్చిన శివలింగాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు



ఇల్లెందు: మొయిన్‌రోడ్డులోని శివాలయంలో..



జూలూరుపాడు: భజన చేస్తున్న టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కమిటీ సభ్యులు



పాల్వంచరూరల్: శివాలయంలో భక్తుల రద్దీ



టేకులపల్లి: ఇప్పలతండాలో కళ్యాణ వేడుక



టేకులపల్లి: బ్రహ్మంగారి ఆలయంలో...



పూజలో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు



పాల్వంచరూరల్: పునుకుల గ్రామంలో..



కొత్తగూడెం గణేష్ టెంపుల్‌లో కళ్యాణ వేడుక



ఇల్లెందు: శివాలయంలో...



జూలూరుపాడులో..



పాల్వంచలో..



కొత్తగూడెంలో..



ఇల్లెందు: విగ్రహాలను మండపం పైకి తీసుకొస్తున్న దృశ్యం



పాల్వంచ: ఆత్మలింగేశ్వరాలయం వద్ద కల్యాణ పూజలు



ఇల్లెందు: పటేల్ చౌక్‌లోని శివాలయంలో..



ఇల్లెందురూరల్: రేపల్లెవాడలో..

## ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

ఇల్లెందు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 218 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును ఉపయోగించుకోనున్నారు. ఇందుకు బుధవారం సామగ్రితో పోలింగ్ సిబ్బంది కేంద్రానికి చేరుకున్నారు. ఎన్నికల ఏర్పాట్లను తహసీల్దార్ కె.రవికుమార్ పర్యవేక్షించారు. రూట్ ఆఫీసర్, సెక్టార్ ఆఫీసర్, పీఓ, ఏపీఓలు కేంద్రంలో సదుపాయాలు, ఓటింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఓటింగ్ జరగనుంది.

జూలూరుపాడు: ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నట్లు తహసీల్దార్ కె.స్వాతిబిందు తెలిపారు.



ఇల్లెందు: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ... స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. ఓటు హక్కు కల్గిన ఉపాధ్యాయులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

## మిర్చికి మద్దతు ధర చెల్లించండి..



కల్లంలో మిర్చిని పరిశీలిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: మిర్చి కనీస మద్దతు ధర రూ.25వేలకు పెంచి రైతులకు చెల్లించాలని సీపీఎం నాయకులు తాళ్లూరి కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలలో మిర్చి కల్లాలను బుధవారం ఆయన సందర్శించారు. మిర్చి పెట్టుబడి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చి ధర దారుణంగా పడిపోవడంతో రైతులకు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. దీనికి తోడు వాతావరణ ప్రతికూల పరిస్థితులతో చీడపీడలు అధికమై పెట్టుబడి వ్యయాన్ని రెట్టింపు చేసిందని వాపోయారు. ఇటువంటి పరిస్థితిలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మద్దతు ధరను పెంచకుండా మీనమేషాలు లెక్కించడం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి రైతులకు మార్కెట్ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవడంతోపాటు మద్దతు ధరగా రూ.25వేలు చెల్లించని పక్షంలో రైతులను సమీకరించి ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## రైల్వే టెండర్లలో కార్మికులకు అన్యాయం

ఇల్లెందు: ఎంఎల్ మాస్‌లైన్ అనుబంధ టీయూసీఐ, ఎస్టీ అనుబంధ ఇఫ్టూ కార్మిక సంఘాలు జాయింట్ ఆందోళన కార్యక్రమం చేపట్టాయి. బుధవారం రెండు సంఘాల నేతలు ఎండీ రాసుద్దీన్, కొత్తపల్లి రఘు ఆధ్వర్యంలో పలు సమస్యలపై డీజీఎం (సివిల్) రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... సింగరేణి సీఎస్‌పీ, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు 30 ఏళ్లుగా కోల్ రైల్వే ట్రాన్స్‌పోర్టులో పని చేస్తున్నట్ల చెప్పారు. ఈనెల 4న దాఖలు చేసిన టెండర్‌లో కార్మికులకు అన్యాయం జరిగిందని, 12 మంది కార్మికులకు గాను ఏడుగురిని మాత్రమే టెండర్‌కు పిలిచారని తెలిపారు. పాత ఎస్‌ఆర్‌లో రూ.38 వేలు ఉండగా కొత్త ఎస్‌ఆర్‌లో కేవలం రూ.24 వేలు మాత్రమే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం రద్దు చేసి పాత టెండర్‌ను కొనసాగించాలని కోరారు. సారంగపాణి, కొండపల్లి శ్రీను, యాకుబ్ పాల్గొన్నారు.



డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

### ఇంట్లో చోరీ

జూలూరుపాడు: మాచినేనిపేట తండాలో ఓ ఇంట్లోకి గుర్తు తెలియన వ్యక్తులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై బి.రవి తెలిపిన వివరాలు... బానోత్ బాలు, తన కుటుంబ సభ్యులతో కలిసి మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం ఇంటికి తాళం వేసి ఖమ్మం జిల్లా వైరా మండలం స్నానాల లక్ష్మీపురం శివాలయానికి వెళ్లారు. అదే రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని సూట్‌కేస్ పగలగొట్టి 2 తులాల బంగారం, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాలు బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి పేర్కొన్నారు.

### సొసైటీ డైరెక్టర్‌కు పరామర్శ



హేమ్లాను పరామర్శిస్తున్న నాయకులు

జూలూరుపాడు: మాచినేనిపేటతండా గ్రామ పంచాయతీకి చెందిన సొసైటీ డైరెక్టర్ లకావత్ హేమ్లాను బుధవారం బీఆర్‌ఎస్ నేతలు పరామర్శించారు. ఇటీవల హేమ్లాకు పెరాలిస్ (పక్షవాతం) రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ మేరకు బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. చాపలమడుగు రామ్మూర్తి, రెడ్డిబోయిన రాము, మద్దెబోయిన రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### పలువురి పరామర్శ

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు దిలీప్‌కుమార్ తల్లి సత్యదేవి(72) అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపి, కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## డ్యూటీ సమయం మార్చండి..



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రంజాన్ పండుగను పురస్కరించుకొని డ్యూటీ సమయాన్ని మార్చాలని, ఒక గంట ముందుగా రిలీవ్ చేయాలని జీఎం పర్సనల్ (ఐఆర్ పీఎం)ను కోరారు. బుధవారం జీఎం చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్ మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెలరోజుల పాటు ఉపవాసం ఉంటూ రోజుకు 5 సార్లు నమాజ్ చేస్తారని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా జీఓ విడుదల చేసిన నేపథ్యంలో సింగరేణిలో పనిచేస్తున్న ముస్లింలకు అవకాశం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జీఎం సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సవీర్, ఖాసీం, జానీ, సిబాహతుల్లా, హైదర్‌గౌస్, అతహర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరులను స్మరించుకోవాలి

టేకులపల్లి: మార్చి 1న ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించాలని ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ పంపకాలలో లొసుగులను సీఎం రేవంత్‌రెడ్డి, ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌లను కలిసి వివరించి, ఎస్సీలలో ఏ వర్గానికీ అసంతృప్తిగా లేకుండా, న్యాయ బద్ధంగా ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం అమలు చేయాలని కోరినందుకు మంద కృష్ణ మాదిగను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల కలిసి బొకే ఇచ్చి సన్మానించడం జరిగిందని పేర్కొన్నారు. మండల, జిల్లా, గ్రామీణ స్థాయిలో అన్ని ప్రాంతాల్లో అమరవీరులకు నివాళులర్పించాలని తెలిపారు. లక్ష డప్పులు – వేయి గొంతులు కార్యక్రమం రద్దు కాలేదని, తాత్కాలికంగా వాయిదా పడిందని, మార్చి 10 తరువాత ఎప్పుడైనా జరగవచ్చని, డప్పు కొనుగోలు ఆపొద్దని తెలిపారు.

## 'గుమ్మడి' హయాంలోనే వెనకబాటు..

ఇల్లెందురూరల్: మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పాతికేళ్ల పాలన వల్లే ఇల్లెందు అన్నిరంగాల్లో వెనుకబాటుకు గురైందని, ఆయన పార్టీకి చెందిన నేతలకు అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యను విమర్శించే అర్హత లేదని కాంగ్రెస్ నాయకులు ముక్తి కృష్ణ, సూర్నపాక సత్యనారాయణ అన్నారు. మామిడిగుండాల గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సుదీర్ఘకాలంగా తునికాకు రేట్లపై మక్కువతో ఉద్యమాలు నిర్వహిస్తూ కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి ధరలు నిర్ణయిస్తున్న నేతలు బీడీ పరిశ్రమ ఏర్పాటు కోసం ఎందుకు కృషి చేయలేదని, మూడుసార్లు ఇల్లెందుకు మంజూరైన ఆర్టీసీ బస్‌డిపో ఇతర ప్రాంతాలకు తరలిపోతుంటే ఎందుకు మౌనం వహించారని, ఫారెస్టు ట్రెనింగ్ స్కూల్ హైదరాబాద్‌కు తరలిపోతుంటే ఎందుకు ప్రేక్షక పాత్ర పోషించారని ప్రశ్నించారు. వీరి పోరాటం వల్లే పోడుభూములకు పట్టాలు రాలేదని, అన్నివర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల ఆకాంక్షను గుర్తించి నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక కృషితో పోడు భూములకు పట్టాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఐదుసార్లు ఇల్లెందు ప్రాంత ప్రజలు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రాతినిధ్యం వహించిన పార్టీని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటే మారుమూల ప్రాంతాలకు కనీసం రహదారి సౌకర్యం కూడా మెరుగుపర్చలేకపోయారని ఆరోపించారు. ప్రజాభిమానం చూరగొన్న పార్టీ ఎందుకు ముక్కలైందో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎట్టి హరికృష్ణ, సూర్నపాక వెంకటేశ్వర్లు, కుంజ కృష్ణ, తోలం సురేష్, తెల్లం మహేష్, బంగారు రాంబాబు, కమటం సదయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముక్తి కృష్ణ, సత్యనారాయణ